క్లుప్తంగా

రీవేరిఫికేషన్ తప్పనిసరి

ఏఈఓ మొయినొద్దీన్



రీవేరిఫికేషన్ చేస్తున్న ఏఈఓ మొయినొద్దీన్

దుద్యాల్: పీఎం కిసాన్ డబ్బులు పొందుతున్న రైతులు రీవేరిఫికేషన్ చేయించుకోవాలని దుద్యాల్ ఏఈఓ మొయినొద్దీన్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొంతమంది రైతులకు సంబంధించిన రీవేరిఫికేషన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వివరాలు పూర్తిగా లేని జాబితాను ఏఈఓల దగ్గర ఉంటుందని, వారిని సంప్రదించి వాటిలో పేర్లు ఉన్న రైతులు తప్పకుండా రీవేరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పీఎం కిసాన్ డబ్బులు అందవని తెలియజేశారు.

బోరు పనులు ప్రారంభం



బోరు పనులకు పూజలు చేస్తున్న నాయకులు

ధారూరు: మండలంలోని లక్ష్మీనగర్‌తండా, ఎబ్బనూర్ గ్రామాల్లో బుధవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ బోర్లు వేయించారు. మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఎమ్మెల్యే స్పెషల్ గ్రాంట్ నిధులతో బోర్లు వేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మాజీ సర్పంచు రాజేందర్‌రెడ్డి, కల్వ కిరణ్‌కుమార్, బుజ్జయ్యగౌడ్, మహ్మద్ బాబాఖాన్ తదితరులు బోరుకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో మహిళలు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామపంచాయతీ పరిధిలో పోచమ్మ తల్లి బోనాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. మొదటగా తీపి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. శివసత్తుల పూనకలు, పోతరాజుల విన్యాసాలు, యువత కేరింత మధ్య బోనాల తో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు. అనంతరం వర్షాలు బాగా కురిసి, పాడి, పంటలు బాగా పండాలని కోరుకున్నారు.

యూరియా కోసం క్యూ



లైన్‌లో నిల్చున్న రైతులు

బంట్వారం: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట బుధవారం రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. మార్క్‌ఫెడ్ నుంచి యూరియా సరఫరా గత నాలుగు రోజుల నుంచి ఆలస్యం కావడంతో రైతులు ఒక్కసారిగా యూరియా కోసం తరలి వచ్చారు. సరిపోను యూరియా లేకపోవడంతో స్టాక్ ఉన్నంత వరకు సొసైటీ సిబ్బంది పంపిణీ చేశారు. పలువురు రైతులు యూరియా కోసం నిలబడినప్పటికీ స్టాక్ లేకపోవడంతో వెనుదిగారు. అదే సమయంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ ఏఓ సంధ్య అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అవసరమైన ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేస్తామని చెప్పారు. సరఫరాలో కొంత జాప్యం జరగడంతో రైతులు క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చిందని వివరించారు.

'ఆశల'పై చిన్నచూపు

దోమ: గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సిబ్బందికి సమన్వయకర్తలుగా పనిచేసే తమను ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం తగదని ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు ఆశలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలకు ఆప్తులుగా ఉంటూ ప్రభుత్వ పథకాలు, వైద్యం అందిస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. తమ ఉద్యోగాలకు చట్టభద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాధవి, అతియబేగం, యాదమ్మ, బుడ్డమ్మ, రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం!

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ రోగాలు పొంచి ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, మురుగు కాల్వలు పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని వైద్య ఆరోగ్య అధికారులు సూచిస్తున్నారు.

- జ్వరాలు రాకుండా జాగ్రత్తలు అవసరం
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన చేస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది.. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు కారణమవుతాయి. దోమకాటుకు గురికాకుండా జ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. గాలి, నీటి ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయి. కొందరికి జ్వరంతో పాటు కీళ్ళనొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల పాటు ఉంటుంది.

చేతులు శుభ్రం చేసుకోవాలి..

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తాజావేడి ఆహారం తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇటీవల జీపీ సిబ్బంది వైద్యసిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై అవగహన కార్యక్రమాలు చేపట్టారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు కాలం కావడంతో జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. జ్వరం వస్తే వెంటనే పల్లె దవఖానాలో చికిత్స చేయించుకోవాలి. ఉచితంగా పరీక్షలు నిర్వహించి, సకాలంలో వైద్యం అందజేస్తాం. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవు. – రతన్‌లాల్, వైద్యాధికారి, దౌల్తాబాద్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



ట్రాన్స్‌కో అధికారులతో చర్చిస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలో కరెంటు సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ నేత రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర నాయకులతో కలిసి ట్రాన్స్‌కో ఏడీ, ఏఈలను కలిశారు. గ్రామంలో పలు చోట్ల కిందకు వేలాడుతున్న తీగలు, ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రెండు ట్రాన్స్‌ఫార్మర్లను వారం రోజుల్లోగా ఏర్పాటు చేస్తామని అధికారులు తెలియజేశారు. వర్షాకాలంలో కరెంటు సమస్య రాకుండా తగిన చర్యలను ఇప్పటి నుంచే తీసుకుంటే బాగుటుందని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ నాయీ, గొల్ల చందు, లాలు, ఉప్పరిగిరి శేఖర్ తదితరులు ఉన్నారు.

పదవికే వన్నె తెచ్చిన ధారాసింగ్



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్ ఏ పదవి చేపట్టిన ఆ కుర్చీకే వన్నె తీసుకొచ్చారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలో పదవీ విరమణ పొందిన మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో పాటు నూతనంగా ఎన్నికై న కోటపల్లి వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం సభ్యులకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా వారికి జగ్జీవన్‌రామ్ స్టాచ్ నుంచి సమావేశం మందిరం వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పెద్ద సముంద్రం లాంటిదని, పార్టీలో పనిచేసే వారికి పదవులే వారి ఇంటి గడప తొక్కుతాయన్నారు. ధారాసింగ్ పదవి కాలం ముగియడం ఎంతో బాధాకరం అన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు రమేష్ మహరాజ్ , జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభరాణి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి ,ఏ- బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సిములు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నసీర్, కోటపల్లి ఏఎంసీ చైర్మన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు



చిట్టిగిద్దలో ఇళ్ల మధ్య ఉన్న స్తంభం, తీగలు

నవాబుపేట: ఇళ్లకు అనుకొని విద్యుత్ స్తంభాలు, వేలాడుతూ తీగలతో నిత్యం ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయినా, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని మైనార్టీ కాలనీలో ఇళ్లకు ఆనుకొని స్తంభాలు, విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ పొంచి ఉన్న ప్రమాదం

నవాబుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజలు తిరిగే చోట ఎలాంటి రక్షణ లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మించారు. వికారాబాద్ నుంచి శంకర్‌పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఉండటంతో నిత్యం ప్రజలు తిరుగుతుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ కంచె లేదు. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి: ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలని ప్రధానోపాధ్యాయుడు శంకర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతులపై బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేశారన్నారు. వారు ఎక్కడికి మంచి వెళ్లిన గుర్తింపు వస్తు ందన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, అమర్‌నాథ్, రవీందర్, నిర్మలా పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

బంట్వారం: కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎంఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు సూచించారు.

కోట్‌పల్లిలో త్వరలో మేకల సంత



పాలకవర్గం సభ్యులతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పెద్దేముల్: కోట్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం జరుగు వారాంతపు సంతల్లో త్వరలో మేకల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని కోటపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో మోమిన్‌పేట సంతలో తప్ప పెద్దేముల్, ధారూర్, తాండూరుతో పాటు పలు సంతల్లో మేకల సంత ఎక్కడ లేనందున కోటపల్లిలో ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ ప్రాంత రైతులు, మేకల వ్యాపారస్తులు విక్రయాలు చేయాలన్న మోమిన్‌పేటకు తప్ప మరోమార్గం లేదని నారాయణరెడ్డి సాక్షితో చెప్పారు.

దారి మూసేయడంపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఘణపూర్ రైతులు

మర్పల్లి: మండలంలోని ఘణపూర్ గ్రామంలో ఓ వెంచర్‌కు సంబంధించిన వారు దారి మూసేయడంతో పలువురు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందని ఆ గ్రామ రైతులు వీర్‌షెట్టి, రమేష్ బుధవారం తహసీల్దార్ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 76, 81లోకి వెళ్లేందుకు దారి ఉండేదని వెంచరు వారు మూసేశారని తెలిపారు. విచారణ జరిపించి తమ పొలాలకు వెళ్లేందుకు దారి చూపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, దారి మూసిన సదరు వెంచర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి

ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్

బంట్వారం: వన మహోత్సవంలో భాగంగా మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఈజీఎస్ ఈసీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 4500 మొక్కలు నాటాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే నర్సరీల్లో 18 రకాల మొక్కలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. గుంతల తవ్వకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షాలు బాగా కురువగానే నిర్దేశించిన సమయంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. ఇందుకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

బడెంపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నరేష్

దోమ: బడెంపల్లి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని బడెంపల్లి గ్రామ యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నరేష్ అన్నారు. బుధవారం పరిగి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్సు సౌకర్యం లేక బాలికలు చదువు మానేస్తున్నారని వాపోయారు. దిర్సంపల్లి, బడెంపల్లి మీదుగా దోమ కళాశాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

హామీలు అమలు చేయండి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి, బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బీజేపీ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో రైతు సత్యాగ్రహం నిర్వహించారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నట్లయితే రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ కలిసి రైతు భరోసా కింద రూ.15వేలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు రూ.15వేలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. కమిటీల పేరుతో రైతు భరోసాను ఆలస్యం మండిపడ్డారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రంతో లబ్ధి

ఎంపీఓ విజయ్‌కుమార్

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ విజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో 6 గ్యారంటీలకు సంబంధించి ప్రతిరోజు సేవా కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించడం జరుగుతుందన్నారు. పథకాలు పొందనివారు సత్వరమే సేవా కేంద్రాన్ని సంప్రదించి పూర్తి సమాచారాన్ని పొందాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థికి అభినందనలు

కొడంగల్ రూరల్ : నేవీ పోలీసుకు ఎంపికయిన విద్యార్థి అభితేజగౌడ్‌ను బుధవారం నవీన ఆదర్శ పాఠశాలలో సన్మానించారు. నవీన ఆదర్శ హైస్కూల్‌లో చదివిన విద్యార్థి అభితేజగౌడ్ ఉద్యోగం సాధించడం హర్షణీయమని పాఠశాల ఫౌండర్ డి.వెంకటయ్య, ప్రిన్స్‌పాల్ డివి.నరేష్‌రాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష అన్నారు. విద్యార్థితో పాటు ఆయన తల్లిదండ్రులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం జనార్దన్, మహేందర్ , శకుంతల, సంగీత, మీరజ్ బేగం ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



వినతిప్రతం అందజేస్తున్న అంగన్‌వాడీలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



పరిగి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

దుద్యాల్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశాడు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ, ఆశ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపే ప్రయత్నంలో భాగంగా నిధులు తగ్గిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లకు సంబంధించిన ప్రతిని రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల కొడంగల్ తాలుక సెక్రటరీ నవనీత, టీచర్లు వెంకటమ్మ, రెహన బేగం, రత్నబాయి, యాదమ్మ, రాజేశ్వరి, ఆయాలు జ్యోతి, సావిత్రమ్మ, నర్సమ్మ, ఆనందమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దౌల్తాబాద్: అంగన్‌వాడీ, మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడి బుస్సచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వారి సమస్యలపై తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మల్టీపర్పస్ వర్కర్లకు ఆరునెలలుగా వేతనాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నర్సింగమ్మ, కవిత పద్మమ్మ, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

ప్రైవేటీకరణను ఆపాలి

పరిగి: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ అన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకంగా ఎట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో ఆనంద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా కార్యదర్శి మంగమ్మ పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ బుధవారం పూడూరు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా తమకు రూ. 26వేలు వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశాఖకు అనుబంధంగా ఉంటున్న తమతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో లలిత, లక్ష్మి, శివలీల, శోభారాణి, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: తమ పరిష్కరించాలని ఆయా గ్రామాల ఆశ వర్కర్లు బుధవారం మర్పల్లి తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం స్కీంకు బడ్జెట్ పెంచడంతో పాటు ప్రైవేటీకరణ చేయొద్దన్నారు. ఆశవర్కర్లకు నష్టం కలిగించే ఎగ్జామ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిన్నీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గౌరవ వేతనం అందించాలి


కుల్కచర్ల: ఆశ కార్యకర్తలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించి, తమకు అందాల్సిన గౌరవవేతనాలు, ఉద్యోగ భద్రతపై దృష్టి సారించాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు తోడునీడగా నిలిచిన ఆశలతో వెట్టి చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు సునీత, సుజాత, నర్సమ్మ, స్వరూప, రాధ, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తాండూరు రూరల్: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలంటూ తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ ధారాసింగ్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బుగ్గప్ప, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



పూడూరు: వినతి పత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు



మర్పల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు



కుల్కచర్ల: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశలు